సాక్షి
ఖమ్మం
గురువారం । 18 । ఏప్రిల్ । 2024



సాయంసంధ్యా సమయాన..

మరెక్కడా లేని విధంగా సీతారాముల కల్యాణాన్ని ముదిగొండ మండలం ముత్తారంలో ఆనవాయితీ ప్రకారం సాయంత్రం దాటాక నిర్వహించారు. 8లో

గరిష్టం / కనిష్టం
43° / 26°

వాతావరణం

జిల్లాలో గురువారం ఎండ తీవ్రత పెరిగే అవకాశముంది. ఎండకు తోడు సాయంత్రం వరకు వడగాలులు వీస్తాయి.



స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న సీఎస్ శాంతికుమారి దంపతులు



కల్యాణానికి వస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు, మంత్రి కొండా సురేఖ



స్వామివారికి వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దంపతులు

కల్యాణ వైభోగమే..



స్వామి వారి పచ్చలహారాన్ని చూపిస్తున్న అర్చకులు



సీతమ్మ వారి మెడలో మాంగల్యాన్ని వేస్తూ...



సీతారాములపై తలంబ్రాలు పోస్తున్న అర్చక స్వాములు

అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల వివాహ వేడుక

- వేద మంత్రాల సాక్షిగా ఒక్కటైన ఆదర్శ జంట
- అభిజిత్ లగ్నంలో స్వామి, అమ్మవార్లకు జీలకర్ర, బెల్లం
- కల్యాణ ఘట్టాలను తిలకించి.. పులకించిన భక్తజనం
- పట్టువస్త్రాలు సమర్పించిన సీఎస్ శాంతికుమారి



జీలకర్ర, బెల్లం భక్తులకు చూపుతున్న అర్చకులు



భద్రాచలం: భద్రగిరి భక్తజన సందోహంతో నిండిపోయింది. అంగరంగ వైభవంగా సాగిన శ్రీ సీతారాముల వారి కల్యాణాన్ని తిలకించిన భక్తులు పులకించిపోయారు. భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో బుధవారం భక్తుల జయజయ ధ్వానాలు, మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ సీతా రాముల కల్యాణం కనుల పండువగా జరిగింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అంతరాలయంలో స్వామివారి మూలమూర్తులను దర్శించుకున్న భక్తులు.. ఆ తర్వాత ఆరాధ్య దైవమైన శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణాన్ని కనులారా చూసేందుకు మిథిలా స్టేడియానికి చేరుకున్నారు. ఉదయం 9:45 గంటలకు ప్రధాన ఆలయం నుంచి సీతారాముల తో పాటు లక్ష్మణు డు పల్లకీలో స్టేడియానికి బయలుదేరగా.. భక్తుల కోలాటా లు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ మాడ వీధుల గుండా మిథిలా స్టేడియానికి చేరుకున్నారు.

ఆకట్టుకున్న కన్యావరణ..

ఈ వేడుకను ఉదయం 11:12 గంటల నుంచి 11:16 గంటల వరకు నిర్వహించారు. ఇందులోనే ప్రవరలు, యోక్త్రాబంధనం, యజ్ఞోపవీత ధారణ నిర్వహిస్తారు. ముందుగా సీతమ్మ వారికి తగు వరుడి కోసం ఎనిమిది మంది శ్రీవైష్ణవ పండితులు ఎనిమిది దిక్కుల్లో ప్రవరలు చెబుతూ అన్వేషణ సాగిస్తారు. చివరకు శ్రీరాముడిని వరుడిగా ఎన్నుకుంటారు. అనంతరం 11:19 గంటలకు గోత్ర పూజ, కంకణ పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఎనిమిది దర్భలతో కూడిన తాడును సీతమ్మ నడుముకు ధరింప చేస్తూ యోక్త్రాబంధన కార్యక్రమాన్ని ఉదయం 11:22 గంటలకు నిర్వహించి.. ఆ వెంటనే 11.26 గంటలకు బ్రహ్మచారిగా ఉన్న శ్రీరాముడు గృహస్థాశ్రమంలోకి వెళ్తున్నాడనేందుకు గుర్తుగా యజ్ఞోపవీతాన్ని ధరింపజేశారు.

వరపూజ..

శ్రీ వైష్ణవ పండితులు తమను తాము కన్యాదాతాలుగా భావిస్తూ శ్రీరాముడి పాద ప్రక్షాళన చేయడంతో వరపూజ ప్రారంభమైంది. అనంతరం సీతారామ, లక్ష్మణులను రామదాసు చేయించిన ఆభరణాలతో అలంకరించారు. పచ్చల పతకంతో శ్రీరాముడిని, చింతాకు పతకంతో సీతమ్మను, రామమాడ(ఒకవైపు రాముడి పట్టాభిషేకం, మరోవైపు ఆంజనేయుడు ముద్రలు ఉన్న బిళ్ల)ను లక్ష్మణుడికి ధరింపజేశారు. అనంతరం మధుపర్కం నివేదన చేశారు. ఈ కార్యక్రమం ఉదయం 11:30 గంటల నుంచి 11:37 గంటల వరకు కొనసాగింది. అనంతరం వధూవరులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆ తర్వాత త్రిదండి చిన్న జీయర్ మఠం, శృంగేరి పీఠంతో పాటు శ్రీరంగం, తిరుమల తిరుపతి దేవస్థానం వారు, ఇతర ప్రముఖులు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆపై ఉదయం 11:42 గంటలకు మహా సంకల్ప పఠనం చేశారు.

అభిజిత్ లగ్నం..

మధ్యాహ్నం సరిగ్గా 12 గంటల సమయంలో అభిజిత్ లగ్నం రాగానే జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని భక్తులందరికీ చూపించి వధూవరులైన సీతమ్మ, శ్రీరాముడి తలపై ఉంచారు. ఈ అపురూప క్షణాలను భక్తులందరూ కనులారా చూసి తరించారు.

మాంగళ్యపూజ..

మధ్యాహ్నం 12:10 గంటల సమయంలో మాంగళ్య పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. సాధారణ మంగళ సూత్రంలో రెండు బొట్లు ఉండగా సీతమ్మ మెడలో శ్రీరాముడు కట్టే మంగళ సూత్రానికి మూడు బొట్లు ఉండటం విశేషం. ఒకటి పుట్టింటి వారిది, రెండోది మెట్టింటి వారిది కాగా మూడోది భక్తుల తరుపున శ్రీరామదాసు చేయించినది. సరిగ్గా మధ్యాహ్నం 12:13 గంటలకు మాంగళ్యధారణ వేడుక నిర్వహించారు. ఆ తర్వాత శ్రీరంగనాథుడు, గోదాదేవి కల్యాణం, బంతులాటకు సంబంధించి ప్రబంధాలు పఠించారు.

తలంబ్రాల వేడుక..

తేనె, గులాల్‌తో పాటు పంచద్రవ్యాలు కలిపిన ముత్యాల తలంబ్రాలను మధ్యాహ్నం 12:23 గంటలకు వధూవరులపై పోశారు. ఈ కార్యక్రమం చూసేందుకు పోటీ పడిన భక్తులు, ఆ తలంబ్రాలు దక్కించుకునేందుకు ఉత్సాహం చూపారు. చివరగా మధ్యాహ్నం 12:39 గంటలకు మంగళహారతి ఇవ్వడంతో సీతారాముల కల్యాణ వేడుక ముగిసింది. అనంతరం పల్లకీలో నూతన వధూవరులను ఆలయంలోకి తీసుకెళ్లారు.

కల్యాణ ఘట్టం సాగిందిలా..

ఉదయం 10:31 గంటల నుంచి 10:45 గంటల వరకు విశ్వక్సేన పూజ నిర్వహించారు. శ్రీరాముడి సేనాధిపతి అయిన విశ్వక్సేనుడిని గ్రహాధిపతిగా కూడా పేర్కొంటారు. జరగబోయే కల్యాణానికి ఎలాంటి విఘ్నాలు ఎదురుకాకుండా ఈ పూజ నిర్వహించారు. 10:48 గంటల నుంచి 10:56 గంటల వరకు పుణ్యాహవాచనం నిర్వహించారు. కల్యాణ మండపంలో కలశాన్ని ఏర్పాటు చేసి మంత్రాలు ఉచ్చరిస్తూ ఆ కలశంలోకి పుండరీకాక్షుడిని, సుదర్శనుడుని ఆవాహన చేశారు. ఆ తర్వాత ఈ పుణ్యజలంతో మండలంలో ఉన్న వస్తువులను, పండితులతో పాటు కల్యాణ వేడుకలు చూస్తున్న భక్తులపై చల్లారు. ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా అందరికీ మంచి జరగడంతో పాటు కల్యాణ వేడుకలు దినదినప్రవర్ధమానం అవుతాయని పండితులు తెలిపారు. ఉదయం 10:59 గంటల నుంచి 11:11 గంటల వరకు సుయోద్వాహం నిర్వహించి మిథిలా స్టేడియానికి చేరుకున్న సీతమ్మ వారిని మంత్రపూర్వకంగా కల్యాణ మండపంలోకి తీసుకొచ్చారు.



శ్రీ సీతారాముల వారి కల్యాణానికి హాజరైన భక్తులు

న్యూస్‌రీల్

స్పీడ్ పోస్ట్ ద్వారా భద్రాద్రి తలంబ్రాలు

ఖమ్మంగాంధీచౌక్: భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ తలంబ్రాలను స్పీడ్ పోస్ట్ ద్వారా భక్తులకు చేరవేసే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏటా మాదిరిగానే ఈసారి కూడా భద్రాచలం ఆలయ అధికారులు తపాలా శాఖ ద్వారా తలంబ్రాలను భక్తుల ఇంటికి చేర్చేలా బుకింగ్ స్వీకరించారు. అంతరాలయంలో అర్చన కల్యాణ తలంబ్రాలకు రూ.450గా, ముత్యాల తలంబ్రాలకు రూ.150 ధర నిర్ణయించగా ఖమ్మం తపాలా డివిజన్ పరిధిలో 800కు పైగా బుకింగ్‌లు వచ్చాయి. ఈమేరకు భక్తులకు చిరునామాలకు రెండు, మూడు రోజుల్లో తలంబ్రాల పంపిణీ మొదలుపెట్టే అవకాశముంది.

అయోధ్య రామమందిరం చిత్రంతో తపాలా స్టాంప్‌లు



అయోధ్య మందిరం, ఇతర చిత్రాలతో రూపొందించిన స్టాంప్‌లు

ఖమ్మంగాంధీచౌక్: అయోధ్యలో ఇటీవల ప్రారంభించిన రామమందిరం చిత్రంతో రూపొందించిన ఆరు ప్రత్యేక స్మారక తపాలా బిల్లలను తపాలా శాఖ శ్రీరామనవమి రోజున అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ స్టాంప్‌లను జనవరి 18న ప్రధాని నరేంద్రమోదీ విడుదల చేయగా, ఖమ్మం తపాలా డివిజన్‌కు ఇవి బుధవారం చేరాయి. అయోధ్య రామమందిరంతో పాటు గణనాథుడు, హన్మంతుడు, జటాయువు, శబరి తదితర చిత్రాలు ముద్రించిన రూ.5 విలువైన ఆరు స్టాంప్‌ల అసలు విలువ రూ.30కాగా, ఆరింటితో కూడిన ప్యాక్ ధర రూ.100గా నిర్ణయించారు. ఖమ్మం తపాలా డివిజన్‌కు 900 ప్యాక్‌లను కేటాయించిన అధికారులు ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం ప్రధాన తపాలా కార్యాలయాలకు 300 చొప్పున సరఫరా చేశారు. ఆయా కార్యాలయాలతో పాటు సబ్, బ్రాంచ్ పోస్టాఫీస్‌ల ద్వారా విక్రయించనున్నారు. కాగా, తపాలా శాఖలో స్టాంప్ సేకరణ అకౌంట్ కలిగిన వారికి నేరుగా పంపిస్తుండగా, గుర్తుగా దాచుకునేందుకు మాత్రమే వీలున్న వీటిని ఆసక్తి ఉన్నవారు కొనుగోలు చేయొచ్చు.

నామినేషన్లకు నగారా!

- లోక్‌సభ ఎన్నికలకు నేడు నోటిఫికేషన్
- ఈనెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- ఖమ్మం కలెక్టరేట్‌లోని ఆర్‌ఓ కార్యాలయంలో ఏర్పాట్లు
- ముహూర్తాలు చూసుకుంటున్న అభ్యర్థులు
- నేడో, రేపో అభ్యర్థిని ప్రకటించనున్న కాంగ్రెస్



వెయిటింగ్ రూమ్ వద్ద సూచనలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: లోక్‌సభ ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ గురువారం మొదలుకానుంది. ఇదేరోజు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయనుండగా.. ఖమ్మం లోక్‌సభ స్థానంలో అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణకు అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధమైంది. ఇప్పటికే ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ పలుమార్లు సమీక్షించారు. కలెక్టరేట్‌లోని ఆర్‌ఓ కార్యాలయంలో గురువారం నుంచి ఈనెల 25వరకు ఉదయం 11నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ పత్రాలను స్వీకరిస్తారు. కాగా, ఈనెల 26న స్క్రూటినీ చేయనుండగా, 29 వరకు ఉపసంహరించుకునే వీలుంది. ఆపై మే 13న పోలింగ్ నిర్వహించి జూన్ 4న ఫలితం వెల్లడిస్తారు.

అంతా సిద్ధం..

ఖమ్మం కలెక్టరేట్‌లోని ఆర్‌ఓ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేశారు. నామినేషన్ వేసే అభ్యర్థుల కోసం లోక్‌సభ పరిధి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఏఆర్‌ఓ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు. అక్కడ నామినేషన్ పత్రాలు అందుబాటులో ఉంచడంతో పాటు ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే వీలు కల్పించారు. కాగా, నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థికి సంబంధించిన మూడు వాహనాలను మాత్రమే కలెక్టరేట్ లోపలికి అనుమతిస్తారు. మిగిలిన వాహనాలను 100 మీటర్ల దూరంలో నిలిపివేస్తారు. నామినేషన్ పత్రం ఫారం-2 ఏతో పాటు అఫిడవిట్‌ను ఫారం-26లో సమర్పించాలి. ఈ రెండు ఫారాలు పూర్తిగా నింపాలని ఇప్పటికే పార్టీల ప్రతినిధులకు సూచించారు.

జనరల్ అభ్యర్థులు రూ.25 వేలు..

ఎన్నికల ఖర్చు నిమిత్తం అభ్యర్థులు కొత్త బ్యాంక్ ఖాతా తెరవాల్సి ఉంటుంది. పోటీ చేసే అభ్యర్థి ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ ఓటరు కాకపోతే వారి నియోజకవర్గ పరిధి ఎన్నికల నమోదు అధికారి నుంచి ధ్రువపత్రం సమర్పించాలి. జాతీయ, రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థికి ఒక ప్రతిపాదకుడు, గుర్తింపు పొందని పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులకైతే పది మంది ప్రతిపాదించాల్సి ఉంటుంది. బలపరిచే వారు తప్పనిసరిగా ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని వారై ఉండాలి. ఇక జనరల్ కేటగిరీ అభ్యర్థులైతే రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీలైతే రూ.12,500 సెక్యూరిటీ డిపాజిట్ చేయాలి.

ముహూర్తంతో ముందుకు..

బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామా నాగేశ్వరరావు, బీజేపీ అభ్యర్థిగా తాండ్ర వినోద్‌రావును ఇప్పటికే ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ నేడో, రేపో అభ్యర్థిని ప్రకటించనుంది. ఈమేరకు బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అలాగే, మంచి ముహూర్తం చూసుకుని నామినేషన్ దాఖలకు సిద్ధమవుతున్నారు. బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు ఈనెల 19న నామినేషన్ దాఖలు చేయాలని నిర్ణయించగా.. కార్యక్రమానికి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో పాటు డాక్టర్ లక్ష్మణ్ హాజరవుతారని పార్టీ నేతలు తెలిపారు. ఇక బీఆర్‌ఎస్ అభ్యర్థి ఈనెల 24న నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు.

అనుమతుల కోసం.

ఎన్నికల ప్రచారం, ర్యాలీల అనుమతి కోసం ఎన్నికల సంఘం సువిధ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ ద్వారా పార్టీలు నాయకులు 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ సువిధ యాప్ ద్వారా సాధ్యం కాకపోతే ఏఆర్‌ఓ కార్యాలయంలో అనుమతి తీసుకోవాలి. అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటారు. ఇక 85 ఏళ్లు దాటిన వారికి హోం ఓటింగ్ సౌకర్యం కల్పించగా.. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 2,466 మందిని అర్హులుగా గుర్తించారు.

ఓటర్లు 16,26,427 మంది

ఈనెల 16న ప్రకటించిన ఓటర్ల జాబితా ఆధారంగా ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 16,26,427 మంది ఓటర్లు ఉన్నారు. అయితే, ఈనెల 25న వెలువరించే తుది జాబితా ఆధారంగా ఎన్నికలు నిర్వహించనుండగా ఈ సంఖ్య పెరిగే అవకాశముంది. కాగా, ప్రస్తుతం ఓటర్లలో 18 నుంచి 19 ఏళ్లలోపు ఉన్న యువత 49,393 మంది(3.04 శాతం) ఉండగా.. వీరు లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇదే వయస్సు వారి నుంచి అందిన దరఖాస్తులు మరో 1,465 పెండింగ్ ఉన్నాయి.

పారదర్శకంగా నామినేషన్ల ప్రక్రియ

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ గురువారం ప్రారంభం కానుండగా, పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్షించారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, పోటీ చేసే అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్ సిద్ధం చేయాలని తెలిపారు. అలాగే, పెండింగ్ ఓటర్ నమోదు దరఖాస్తులు పరిష్కరించాలని, ముందస్తుగానే ఓటరు స్లిప్పుల పంపిణీ చేపట్టాలని సూచించారు. అనంతరం కలెక్టర్ గౌతమ్ జిల్లా అధికారులతో సమావేశమై నామినేషన్ల స్వీకరణ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఆతర్వాత హెల్ప్ డెస్క్, వద్ద సౌకర్యాలు, ధర్నా చౌక్ వద్ద ఏర్పాటుచేస్తున్న మీడియా పాయింట్‌ను పరిశీలించారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, మ్రినాల్ శ్రేష్ఠ, డీఆర్వో రాజేశ్వరి, జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావు, జిల్లా ఉపాధికల్పన అధికారి కె.శ్రీరామ్, ఆర్డీఓ జి.గణేష్, ఉద్యోగులు అరుణ, మదన్‌గోపాల్, మీనన్, సత్యనారాయణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సమన్వయకర్తల నియామకం

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం లోక్‌సభ పరిధి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమిస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటన విడుదల చేశారు. వీరు ఆయా నియోజకవర్గాల పరిధిలో ప్రచారంలో పాల్గొనడంతో పాటు కేడర్‌ను సమన్వయం చేయాల్సి ఉంటుంది. పాలేరుకు ఎమ్మెల్సీ తాతా మధు, ఖమ్మంకు డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, వైరాకు తాళ్లూరి జీవన్, మధిరకు మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, కొత్తగూడెంకు ఉప్పలపాటి వెంకటరమణ, సత్తుపల్లికి బీరెడ్డి నాగచంద్రారెడ్డి, అశ్వారావుపేటకు కోనేరు చిన్నిని నియమించారు.

ఎండ ప్రచండం

- పమ్మిలో అత్యధికంగా 44.2 డిగ్రీలు
- మిగతా ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి



ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో ఎండ తీవ్రత పెరుగుతోంది. ఈ వారమంతా నానాటికీ ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉన్నాయి. సోమవారం జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రత 43.4, మంగళవారం 43.8గా నమోదు కాగా, బుధవారం ఏకంగా 44.2 డిగ్రీలకు చేరింది. జిల్లాలోని ముదిగొండ మండలం పమ్మిలో గరిష్టంగా 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మిగతా చోట్ల కూడా 40డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఉదయం 8గంటలకే ఎండ మొదలై పది గంటల తర్వాత బయటకు రాలేని పరిస్థితి ఉంటోంది. కాగా, బుధవారం ఖమ్మంలో 43.9, కూసుమంచిలో 43.7, కల్లూరులో 43.6, నేలకొండపల్లి, గేట్‌కారేపల్లిల్లో 43.5, తల్లాడ, తిరుమలాయపాలెంల్లో 43.3, తిమ్మారావుపేటలో 43.2, చింతకాని 43.1, సత్తుపల్లిలో 42డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదు కావడంతో జనం అల్లాడిపోయారు.

స్వగ్రామంలో డిప్యూటీ సీఎం భట్టి

వైరారూరల్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన స్వగ్రామమైన వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురానికి బుధవారం వచ్చారు. శ్రీరామనవమి సందర్భంగా నూతి అనంతరాములు జ్ఞాపకార్థం ఆయన కుమారులు నిర్వహించిన అన్నదానంలో పాల్గొనగా.. గ్రామస్తులతో మాట్లాడి కుటుంబాల జీవన స్థితిగతులు, ఇతర అంశాలను తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో దొడ్డా పుల్లయ్య, నూతి సత్యనారాయణ, వెంకటస్వామి, వెంకటేశ్వరరావు, పొట్లపల్లి నాగేశ్వరరావు, చిట్టోజు వెంకన్న, పెద్దప్రోలు లక్ష్మయ్య, సంగెపు కృష్ణ, లోకేష్‌యాదవ్ పాల్గొన్నారు.

నేడు జగదభిరాముడి పట్టాభిషేకం

- చతుఃస్థానార్చన హోమంతో మొదలు
- నదీ, సముద్ర జలాలతో పూజలు
- ముఖ్య అతిథిగా హాజరు కానున్న గవర్నర్ రాధాకృష్ణన్

భద్రాచలం: త్రేతాయుగంలో శ్రీరాముడి మహా పట్టాభిషేకం స్మరణకు వచ్చేలా అదే చైత్ర పుష్యమి ముహూర్తానా పట్టాభిషేక మహోత్సవాన్ని భద్రాచల పుణ్యక్షేత్రంలో నిర్వహిస్తారు. ఈ క్రమంలో గురువారం ఉదయం యాగశాలలో చతుః స్థానార్చన హోమం నిర్వహిస్తారు. 10 గంటలకు శంఖ, చక్ర, ధనుర్బాణాలు ధరించిన లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవ విగ్రహాలను మేళతాళాలు, కోలాటం, భక్తుల జయజయ ధ్వానాల నడుమ మిథిలా స్టేడియంలోకి తీసుకొస్తారు. సింహాసనంలో వేంచేపు చేశాక ఎలాంటి విఘ్నాలు రాకుండా విశ్వక్సేన పూజ చేస్తారు. ఆ తర్వాత పుణ్యావాచనం చేసి మంత్రజలంతో ప్రాంగణాన్ని, పూజా సామగ్రిని సంప్రోక్షణ చేస్తారు.

మూడు మండపాలు

పట్టాభిషేకం జరిగే ప్రధాన మండపానికి ముందు మూడు ఉప మండపాలు ఏర్పాటుచేస్తారు. ఒక మండపంలో హన్మంతుడు, సుగ్రీవుడు సహా ఎనిమిది మంది రామపరివారం, అష్టదిక్పాలకులను, మధ్య మండపంలో మంత్రజలంతో 500నదులు, నాలుగు సముద్ర జలాలను ఆవాహన చేస్తారు. మూడో మండపంలో శ్రీరాముడికి రాజ ముద్ర, రాజదండం, పాదుకలు ఉంచుతారు. అనంతరం అష్టోత్తర సహస్ర నామార్చన, సువర్ణ పుష్పార్చనలతో పూజలు నిర్వహించి పంచకుండాత్మక, పంచేష్టి సహిత చతుర్వేద హవనం, మండపత్రయ ఆరాధన నిర్వహిస్తారు.

ఎనిమిది మంది మంత్రులు

శ్రీరాముడి పట్టాభిషేకం నిర్వహించేందుకు వైదిక మంత్రాలతో వశిష్టుడు, వామనుడు, జాబాలి, కశ్యపుడు, కాత్యాయనుడు, గౌతముడు, విజయుడు, సుయజ్ఞుడు అనే 8మంది మంత్రులను వేద పండితులు వరింపజేసుకుంటారు. అనంతరం పట్టాభిషేకం నిర్వహిస్తారు. వీరికి నేతృత్వం వహించేందుకు వాల్మీకి స్థానాన్ని మరొకరు వరింపజేసుకుని పట్టాభిషేక మహోత్సవాన్ని పూర్తి చేస్తారు.

ముఖ్య అతిథిగా గవర్నర్

పట్టాభిషేక వేడుకలకు గవర్నర్లు వచ్చి పట్టు వస్త్రాలు సమర్పించే సంప్రదాయం కొనసాగుతోంది. ఈ ఏడాది కూడా గవర్నర్ రాధకృష్ణన్ భద్రాచలం రానున్నారు. పట్టాభిషేకాన్ని ప్రత్యక్షంగా వీక్షిస్తే విజయసిద్ధి కలుగుతుందని నమ్మకంతో సీతారాముల కల్యాణానికి వచ్చిన భక్తులు చాలా మంది బుధవారం రాత్రి భద్రాచలంలోనే ఉండిపోయారు.

క్లుప్తంగా

రామయ్యకు పచ్చలహారం సమర్పించిన పువ్వాడ



అర్చకుడికి హారం అందజేస్తున్న నయన్‌రాజ్

ఖమ్మంమయూరిసెంటర్: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామి వారికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పచ్చలు పొదిగిన స్వర్ణహారాన్ని సమర్పించారు. ఈ మేరకు హారాన్ని ఆయన తనయుడు నయన్‌రాజ్ బుధవారం ఆలయంలో అర్చకులకు అందజేశారు. కాగా, శ్రీరామనవమి సందర్భంగా జిల్లా ప్రజలకు పువ్వాడ అజయ్‌కుమార్ ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

సత్తుపల్లిటౌన్: ప్రమాదవశాత్తు చెరువులో పడిన వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. సత్తుపల్లి జవహర్‌నగర్‌కు చెందిన గుంజా మారేశ్వరరావు(35) మద్యం మత్తులో బహిర్భూమి కోసం తామరచెరువు వద్దకు వెళ్లాడు. అక్కడ మెట్లపై జారిపడగా ముఖానికి గాయాలయ్యాయి. దీంతో బయటకు వచ్చిన ఆయన కిందకు వంగి గాయాలను కడుగుతుండగా ప్రమాదవశాత్తు జారి చెరువులో పడ్డాడు. సమీపంలో ఉన్న వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు చేరుకుని అప్పటికే మృతి చెందిన మారేశ్వరరావు మృతదేహాన్ని తీయించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉండగా, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నాలుగు సెల్‌ఫోన్లు చోరీ

ముదిగొండ: ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో నలుగురి సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. గ్రానైట్ కార్మికులు మంగళవారం పగలంతా పనిచేసి రాత్రి గాఢ నిద్రలో ఉన్న ఉండగా నలుగురి ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బుధవారం పరిశ్రమ యజమాని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వైన్స్‌లో నగదు, మద్యం చోరీ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ఓ వైన్స్‌లో గుర్తు తెలియని దుండగుడు చోరీకి పాల్పడ్డాడు. నేలకొండపల్లిలోని శ్రీ లక్ష్మీతిరుపతమ్మ వైన్స్‌లోకి మంగళవారం రాత్రి ముఖానికి మంకీ మాస్క్ ధరించిన వ్యక్తి ప్రవేశించాడు. వైన్స్ పైకప్పు రేకులు తొలగించి చొరబడిన సదరు వ్యక్తి రూ.30 వేల నగదు, మద్యం ఫుల్ బాటిల్ ఎత్తుకెళ్లాడు. ఈమేరకు బుధవారం యాజమాని పి.శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, చోరీకి పాల్పడిన వ్యక్తి ముఖం కనిపించకుండా మంకీ మాస్క్ ధరించడంతో విచారిస్తున్నారు.

భర్త చేతిలో గాయపడిన మహిళ మృతి

చింతకాని: మండలంలోని బస్వాపురంలో భర్త చేతిలో గాయపడిన మహిళ రసపుత్ర లలిత (31) ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. గత శనివారం తెల్లవారుజామున లలితపై ఆమె భర్త ముత్తారావు రోకలిబండతో దాడి చేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెకు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా బుధవారం ఉదయం కన్ను మూసింది. కాగా, నిందితుడైన ముత్యారావును మంగళవారమే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

వేంసూరు: రోడ్డుప్రమాదంలో గాయపడిన సత్తుపల్లి గాంధీనగర్‌కు చెందిన నందిపాటి రాజా(42) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈనెల 14వ తేదీ ఆదివారం రాజా, మరో వ్యక్తితో కలిసి వేంసూరు మండలం కందుకూరులో జరిగిన కార్యక్రమానికి హాజరై వెళ్తున్నాడు. గ్రామశివార్లలో రోడ్డుపక్కన మూత్రవిసర్జన చేస్తుండగా ఆటో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన రాజాను ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం రాత్రి మృతి చెందగా, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత మృతిపై కేసు నమోదు

కల్లూరు: కల్లూరుకు చెందిన చల్లా నర్సింహారావు – పుష్పవతి మంగళవారం రాత్రి పురుగుల మందు తాగగా, పుష్పవతి భార్య మృతి చెందిన విషయం విదితమే. ఈ ఘటనపై మృతురాలి తండ్రి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. నర్సింహారావు దంపతులు బేధాభిప్రాయాలతో క్షణికావేశానికి లోనై పురుగుల మందు తాగారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కుమార్తె మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని ఆయన తెలిపారు. కాగా, నర్సింహారావు పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ తరలించి చికిత్స చేయిస్తున్నారు.

జామాయిల్ తోట దగ్ధం

ఖమ్మంరూరల్: మండలంలోని కాచిరాజుగూడెంలో సయ్యద్ సాధిక్‌అలీకి చెందిన 20 ఎకరాల జామాయిల్ తోటను అదే గ్రామానికి చెందిన నలుగురు దగ్ధం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సాధిక్‌అలీ జామాయిల్ తోట సాగు చేస్తుండగా బుధవారం అర్ధరాత్రి చవిడి రామారావు, చవిడి లింగేశ్వరరావు, చవిడి వెంకన్న, మండల క్రిష్ణయ్య నిప్పుపెట్టడంతో చెట్లు కాలిపోయాయి. ఘటనపై సాధిక్ గురువారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.



గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తజనం

అంతా రామమయం..

శ్రీసీతారాముల కల్యాణాన్ని వీక్షించిన భక్తజనం

- కిక్కిరిసిన భద్రాచల పుణ్యక్షేత్రం
- హాజరైన పలువురు ప్రముఖులు

భద్రాచలంలో బుధవారం జరిగిన శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణాన్ని కనులారా వీక్షించేందుకు వేలాదిగా భక్తులు హాజరయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు మంగళవారం సాయంత్రమే చేరుకున్నారు. బుధవారం తెల్లవారుజామునే పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి మిథిలా స్టేడియంలో జరిగిన కల్యాణోత్సవాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతికుమారి ఏర్పాట్లపై కలెక్టర్ ప్రియాంక తదితరులు సమీక్షిస్తూ భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. కాగా, కల్యాణానికి హాజరైన ప్రముఖుల్లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి పమిడిఘంటం శ్రీనరసింహ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేశ్, అడ్వకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు ఎన్.హరినాథ్, శ్రీనివాసరెడ్డి, సుమతి, కిరణ్మయి, రవీంద్రనాథ్ తిల్‌హర్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు కిషన్, ఎంపీ మాలోత్ కవిత, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, తెలంగాణ పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఎం.హన్మంతరావు, మల్టీ జోన్–1 ఐజీ ఏవీ రంగనాథ్, జైళ్ల శాఖ ఐజీ వై.రాజేశ్, సింగరేణి సీఎండీ బలరామ్, మిషన్ భగీరథ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేంద్రమోహన్, జిల్లా జడ్జి వసంత్ పాటిల్, కొత్తగూడెం సీనియర్ సివిల్ జడ్జి భానుమతి, జూనియర్ సివిల్ జడ్జి రామారావు, భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సూరిరెడ్డి, ఖమ్మం జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జీవన్ కుమార్, ఇల్లెందు జూనియర్ సివిల్ జడ్జి కీర్తి చంద్రిక, ఖమ్మం ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి అర్చనాకుమారి, మణుగూరు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి వెంకటేశ్వర్లు, కొత్తగూడెం అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శివనాయక్ ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజుతో పాటు దేవనాథ రామానుజ జీయర్‌స్వామి, కేంద్ర మాజీ మంత్రి కృష్ణంరాజు భార్య శ్యామలాదేవి, దైవజ్ఞశర్మ తదితరులు ఉన్నారు. కాగా, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, ఎస్పీ రోహిత్‌రాజ్, భద్రాచలం దేవస్థానం ఈఓ రమాదేవి, ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్ / భద్రాచలం అర్బన్



కల్యాణం వీక్షిస్తున్న యువతులు



గోదావరి ఒడ్డున భక్తుల పూజలు



భద్రాచలం ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ



భద్రతా ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్



వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వాహనం



ఎండకు తాళలేక చెట్లనీడలో సేదదీరుతున్న భక్తులు



కల్యాణానికి హాజరవుతున్న సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు శ్రీనరసింహ, భీమపాక నగేష్



తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి



దేవనాథ రామానుజ జీయర్



తలంబ్రాలతో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, సమాచార శాఖ కమిషనర్ హన్మంతరావు



టీటీడీ తరఫున వచ్చిన పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఈఓ రమాదేవి



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ రోహిత్‌రాజ్







శ్రీసీతారాముల కల్యాణానికి హాజరవుతున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు ఎన్.హరినాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్మయి



మహబూబాబాద్ ఎంపీ కవిత



సింగరేణి సీఎండీ బలరామ్, ఐజీ రంగనాథ్

గుర్తింపు లేదని మాజీ ఎమ్మెల్యే మనస్తాపం?

రాములునాయక్ ఇంటికి వెళ్లిన బీఆర్‌ఎస్ నేతలు

వైరా: వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ ఇంటికి బుధవారం రాత్రి బీఆర్‌ఎస్ నాయకులు పలువురు వెళ్లారు. పార్టీలో తనకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదనే అసంతృప్తితో ఆయన ఉన్నట్లు తెలియడంతో ఖమ్మంలోని ఇంటికి వెళ్లి చర్చలు జరిపారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాత మధు తదితరులు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌లో సేవలకు తగిన ప్రాధాన్యత ఉంటుందని రాములునాయక్‌కు వారు హామీ ఇచ్చారు. వైరా ఏఎంసీ చైర్మన్ పసుపులేటి మోహనరావు, నాయకులు మోరంపుడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీలు, ఎమ్మెల్సీతో రాములునాయక్, నాయకులు

వెల్లివిరిసిన మత సామరస్యం

కొత్తగూడెంఅర్బన్/దమ్మపేట/ఖమ్మంవన్‌టౌన్: శ్రీ రామనవమి సందర్భంగా ఊరువాడ శ్రీసీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ మేరకు పలు ప్రాంతాల్లో ఎండవేడితో ఇబ్బంది పడుతున్న భక్తులకు ముస్లింలు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేసి మత సామరస్యాన్ని చాటారు. కొత్తగూడెంలోని ఉర్దూ ఘర్ వద్ద ముస్లింలు భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. అలాగే, దమ్మపేటలో శ్రీసీతారాముల కల్యాణ వేడుకకు హాజరైన భక్తులకు షేక్ బాషా తాగునీరు అందజేయగా పలువురు అభినందించారు. ఖమ్మం నిజాంపేటకు చెందిన ముస్లిం యువకులు వైరారోడ్డులో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అహ్మద్ అలీ, సోహెయిల్, షకీల్, సిద్ధిఖీ, గౌస్, అజ్జు, మహబూబ్, రెహాన్, నజీబ్, కరీం, ఇర్ఫాన్ పాల్గొన్నారు.



ఖమ్మంవన్‌టౌన్: మజ్జిగ అందజేస్తున్న నిజాంపేట ముస్లిం యూత్ సభ్యులు

అత్తామామ వేధింపులు తాళలేక ఆందోళన

బోనకల్: భర్త చనిపోయి దుఃఖంలో ఉన్న ఆమెను అత్తామామలు, బావ, తోటికోడలు వేధిస్తుండగా ఇంటి ముందు బుధవారం ఆందోళనకు దిగింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మంకు చెందిన ఉద్యానశాఖ ఉద్యోగి కిల్లా రచనకు బోనకల్‌కు చెందిన బండి సురేష్‌తో 2022లో వివాహం జరిగింది. పెళ్లయిన కొన్నాళ్ల నుంచే బావ చిరంజీవి, తోటికోడలు కృష్ణప్రియాంక రచనను వేధిస్తుండగా, సురేష్ ఖమ్మంలో షాపు పెట్టుకున్నాడు. వీరిద్దరు ప్రతిరోజు బోనకల్ నుంచి ఖమ్మం వెళ్లివచ్చేవారు. ఆతర్వాత సురేష్ ఓ యాప్ ద్వారా రూ.2లక్షలు, ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో రూ.24 లక్షలు రుణం తీసుకోగా రచన ష్యూరిటీ సంతకం చేసింది. ఆపై బోనకల్ ఎస్‌బీఐలోనూ మరో రూ.10లక్షల రుణం తీసుకున్నప్పటి నుంచి సురేష్, కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇంతలోనే ఈనెల 3వ తేదీన రాత్రి సురేష్ రైలు ప్రమాదంలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ ఘటన మరువకముందే అత్తామామలు విజయకుమారి, యాకూబ్, బావ, తోటికోడలు తనను వేధిస్తూ చంపేందుకు ప్రయత్నం చేస్తున్నారని రచన ఆరోపించింది. ఈమేరకు ఇంటిముందు ఆమె ఆందోళన చేస్తుండగా పోలీసుల జోక్యంతో స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. తన భర్త మృతికి సైతం అత్తామామలు, తోటికోడలు, బావే కారణమని.. తనకు సైతం ప్రాణహానీ ఉందని ఫిర్యాదు చేసినట్లు రచన వెల్లడించింది.

సాయంసంధ్యా సమయాన కల్యాణం!

ముత్తారంలో ప్రత్యేకంగా శ్రీసీతారాముల పరిణయ వేడుక


ముదిగొండ: మండలంలోని ముత్తారంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీసీతారాముల కల్యాణం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. మరెక్కడా లేని విధంగా గత 300ఏళ్లుగా ఇక్కడ కల్యాణ క్రతువు సాయం సంధ్యా సమయాన నిర్వహిస్తున్నట్లు చెబుతారు. ఈమేరకు బోర్రా వాసుదేవాచార్యులు, శ్రీనివాసాచార్యుల శిష్య బృందం ఆధ్వర్యానవిశ్వక్షేషన పూజ, కలశస్థాపన, ఆరాధన, ఎదుర్కోలుతోపాటు స్వామివారి కల్యాణం వైభవంగా జరిపించారు. దేవాలయ పునఃనిర్మాణ ధర్మకర్త పర్చూరి ప్రసాద్‌రావు దంపతులు, స్థలదాత కంకిపాటి శేషుప్రసాద్ దంపతులు, వనం వెంకటనాగేశ్వరరావు, వనం వెంకటేశ్వరరావు పూజలో కూర్చున్నారు. కాగా, కల్యాణంలో స్వామి వారికి వనం రాధారాణి ప్రత్యేకంగా అలంకరించిన తెర సెల్లా సమర్పించారు. ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి, డైరెక్టర్ వనం ప్రదీప్తచక్రవర్తి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో పాటు కొమ్మినేని రమేష్‌బాబు, మందరపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, దేవాదాయశాఖ అధికారి సమతతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శ్రీ సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

జమలాపురంలో...

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. తొలుత యాగశాలలోని కల్యాణమూర్తులకు పూజలు చేశాక పల్లకీలో కల్యాణ మండపానికి చేర్చారు. అక్కడ పూజల అనంతరం భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయం నుండి వచ్చిన ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి సమర్పించారు. ఆతర్వాత ఆలయ అర్చకులు ఉప్పల రాజీవ్‌శర్మ దంపతులతో పురాణం రవికుమార్‌శర్మ కల్యాణం జరిపించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు కల్యాణాన్ని తిలకించగా.. ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ చేసిన వ్యాఖ్యానం ఆకట్టుకుంది. కల్యాణం అనంతరం శ్రీసీతారాముల ఉత్సవ మూర్తులను గ్రామంలో హనుమత్ వాహనంపై ఊరేగించారు. ఇక మండలంలోని వెంకటాపురం గ్రామంలోని శ్రీవారి దత్తత దేవాలయంలో కూడా సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉప ప్రధాన అర్చకుడు ఉప్పల విజయదేవశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.



శ్రీసీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు